# విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది. 22.06-2017.**

## మున్సిపల్ కార్పోరేషన్‌కు సంబంధించిన టి.డి.ఆర్. బాండ్‌లను నకిలీలను సృష్టించి, వాటిని విక్రయించిన ముఠా గుట్టు రట్టు

విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్‌కు సంబంధించిన టిడిఆర్ బాండ్‌లకు నకిలీలలను సృష్టించడంతో పాటు వాటిని లక్షలాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకున్న ఘరానా ముఠాలోని ఆరుగురు సభ్యులను ది.21.06.2017న లా&ఆర్డర్-2 డిసిపి శ్రీ పి.పాల్‌రాజు గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో సౌత్‌జోన్ ఏసిపి శ్రీ కె.శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో సూర్యారావుపేట ఇన్‌స్పెక్టర్ శ్రీ జి.వి.వినయ్‌మోహన్, ఎస్ఐ షరీఫ్ వారి సిబ్బందితో కలసి అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుండి నకిలీ టిడిఆర్ బాండ్ పత్రాలు మరియు విజయవాడ నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన నకిలీ స్టాంపులు ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఈ కేసుకు సంబంధించి విజయవాడకు చెందిన ధనేకుల నాగేంద్రబాబు అనే వ్యక్తి తనకు ప్రకాశం రోడ్డులో ఉన్న భూమిలో కొంత భాగం రోడ్డు విస్తరణలో పోయినట్లు, అందుకు గాను తనకు విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ వారు టి.డి.ఆర్. బాండ్‌లను మంజూరు చేయగా వాటిని కొందరు వ్యక్తులు ఫోర్జరీ చేసి, నకిలీ టిడిఆర్ బాండ్‌లను తయారు చేసి, వాటిని లక్షలాది రూపాయలకు ఇతర బిల్డర్‌లకు విక్రయించినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది.

సూర్యారావుపేట పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేయగా అనేక విషయాలు వెలుగు చూశాయి. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన తాడేపల్లికి చెందిన పూనూరి సామ్యూల్ రాజశేఖర్ (45) అనే వ్యక్తి చాలా కాలం విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేశాడు. సులబంగా డబ్బు సంపాదించి విలాసవంతంగా జీవించాలనే మనస్థత్వం కలిగిన రాజశేఖర్ గతంలో అనగా 2013-2014 సం॥లో విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్‌కు సంబంధించిన రెండు టిడిఆర్ బాండ్‌ల ఓసీలను కార్యాలయం నుండి దొంగిలించి వాటిని కందుల సురేష్ అనే వ్యక్తికి సుమారు రూ.2 లక్షలకు విక్రయించాడు. అనంతరం రాజశేఖర్ 2015 సం॥లో కూడా ధనేకుల నాగేంద్రబాబుకు సంబంధించిన టిడిఆర్ కాపీ ఓసీలను కార్యాలయం నుండి దొంగిలించి మరలా వాటిని సురేష్‌కు అనే వ్యక్తికి ఇవ్వగా వాటిని కలర్ జిరాక్స్ కాపీ తీసి ఓసి అతని వద్దనే ఉంచుకుని, కలర్ జిరాక్స్‌ను తిరిగి రాజశేఖర్‌కు ఇవ్వడం జరిగింది.

గతంలో సురేష్ టిడిఆర్ నకిలీ బాండ్ పత్రాలను ఎక్కువ ధరకు విక్రయించినట్లు తెలుసుకున్న రాజశేఖర్ సురేష్ ఇచ్చిన కలర్ జిరాక్స్‌ను సువర్ణ రత్నరాజు అనే వ్యక్తికి ఇవ్వగా అతను తన బావ ఎడ్విన్ సామ్యూల్ సింగ్‌కు ఇచ్చాడు. మరలా రాజశేఖర్, రమేష్ అనే వ్యక్తిని కలుపుకుని ఒక నకిలీ టిడిఆర్ బాండ్‌ను తయారు చేసి, అందుకు రమేష్ రూ.1 లక్ష తీసుకోవడం జరిగింది. ఆ నకిలీ బాండ్‌లను అటెండర్ రాజశేఖర్ బావమర్ధి అయిన బొక్కా అనిల్ మరియు కృష్ణమోహన్, సువర్ణరాజు, మామిళ్ళపల్లి వెంకట్రావు అనే వ్యక్తులు అందరూ కలిసి నకిలీ స్టాంప్‌పేపర్లపై నకిలీ సంతకాలు చేసి, వాటిని బాండ్‌తో సహా సందిరెడ్డి నాగేంద్ర అనే వ్యక్తికి రూ.34 లక్షలకు విక్రయించారు. సువర్ణరాజు వద్ద ఉన్న కలర్ జిరాక్స్ బాండ్‌ను ఎడ్వర్ట్ శ్యామ్యూల్ అనే వ్యక్తి స్టాంప్ పేపర్లు తయారు చేసుకుని నకిలీ సంతకాలు చేసి వాటిని జయంతి వెంకట సుబ్రమణ్యం అనే వ్యక్తికి రూ.25 లక్షలకు విక్రయించడం జరిగింది.

ఈ కేసులో ముఖ్య సూత్రధారి అయిన **(1) అటెండర్ పూనూరి శామ్యూల్ రాజశేఖర్ (42), (2) వెన్నకోట రమేష్ (36), (3) బొక్కా అనిల్ కుమార్ (33), (4) విజయవాడకు చెందిన సువర్ణరత్నరాజు (43), (5) మామిళ్ళపల్లి వెంకట్రావు (38), (6) ఎడ్వర్డ్ సింగ్ శ్యామ్యూల్ (45)** లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి నకిలీ టిడిఆర్ బాండ్ పత్రాలు మరియు విజయవాడ నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన నకిలీ స్టాంపులు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

--- xx ---